22-03-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఎంత సమయం లభిస్తే అంత సమయం అంతర్ముఖులుగా ఉండేందుకు పురుషార్థం చేయండి, బాహ్యముఖతలోకి రాకండి, అప్పుడే పాపాలు అంతమవుతాయి"

ప్రశ్న:- బాబా పిల్లలందరికీ నేర్పించే ఎక్కే కళ యొక్క పురుషార్థము ఏమిటి?

జవాబు:- 1) పిల్లలూ, ఎక్కే కళలోకి వెళ్ళాలంటే బుద్ధియోగాన్ని ఒక్క తండ్రితో జోడించండి. ఫలానావారు ఇలా ఉన్నారు, వీరు ఇలా చేస్తారు, వీరిలో ఈ అవగుణాలు ఉన్నాయి - ఈ విషయాలలోకి వెళ్ళవలసిన అవసరం లేదు. అవగుణాలను చూడడం నుండి ముఖాన్ని తిప్పేసుకోండి. 2) ఎప్పుడూ కూడా చదువుపై అలగకండి. మురళిలో మంచి, మంచి పాయింట్లు ఏవైతే ఉంటాయో వాటిని ధారణ చేస్తూ ఉండండి, అప్పుడే ఎక్కే కళ ఏర్పడగలదు.

ఓం శాంతి. ఇప్పుడు ఇది జ్ఞానం క్లాస్ మరియు ఉదయం యోగం క్లాస్ ఉంటుంది. ఇది ఏ యోగము అన్నది చాలా బాగా అర్థం చేయించాలి, ఎందుకంటే చాలా మంది మనుష్యులు హఠయోగములో చిక్కుకొని ఉన్నారు. ఆ హఠయోగాన్ని మనుష్యులు నేర్పిస్తారు. ఇది రాజయోగము, దీనిని పరమాత్మ నేర్పిస్తారు ఎందుకంటే రాజయోగాన్ని నేర్పించేందుకు రాజులు అయితే ఎవరూ లేరు. ఈ లక్ష్మీ-నారాయణులు భగవతీ-భగవానులు, వారు రాజయోగాన్ని నేర్చుకున్నారు కావుననే భవిష్యత్తులో భగవతీ, భగవానులుగా అయ్యారు. ఇది పురుషోత్తమ సంగమయుగము గురించిన వివరణ. దీనిని పురుషోత్తమ యుగము అని అంటారు. ఇది పాత ప్రపంచము మరియు కొత్త ప్రపంచము మధ్యలో ఉంది. పాత మనుష్యులు మరియు కొత్త దేవతలు. ఈ సమయంలో మనుష్యులందరూ పాతగా ఉన్నారు. కొత్త ప్రపంచములో కొత్త ఆత్మలు, దేవతలు ఉంటారు. అక్కడ వారిని మనుష్యులు అని అనరు. వారూ మనుష్యులే కానీ దైవీ గుణాలు కలవారు, అందుకే వారిని దేవీ-దేవతలు అని అంటారు. వారు పవిత్రముగా కూడా ఉంటారు. తండ్రి పిల్లలకు అర్థం చేయిస్తున్నారు - కామం మహాశత్రువు, ఇది రావణుని మొట్టమొదటి భూతము. ఎవరైనా చాలా క్రోధం చేస్తుంటే - నీవు అలా ఎందుకు భౌ-భౌ చేస్తున్నావు అని అంటారు! ఈ రెండు వికారాలూ పెద్ద శత్రువులు. లోభము, మోహము గురించి భౌ-భౌ అని అనరు. మనుష్యులలో సైన్స్ అహంకారము కారణముగా ఎంత క్రోధము ఉంది, అది కూడా చాలా నష్టదాయకమైనది. కామము యొక్క భూతము ఆదిమధ్యాంతాలు దుఃఖమునిస్తుంది. ఒకరిపై ఒకరు కామ ఖడ్గాన్ని ఉపయోగిస్తారు. ఈ విషయాలన్నింటినీ అర్థం చేసుకొని ఇతరులకు అర్థం చేయించాలి. మీరు తప్ప తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునే సత్యమైన దారిని ఇంకెవ్వరూ తెలియజేయలేరు. పిల్లలైన మీరే అది తెలియజేయగలరు. అనంతమైన తండ్రి నుండి ఇంత పెద్ద వారసత్వము ఎలా లభిస్తుంది - ఇది ఎవరికైనా అర్థం చేయించలేకపోతే తప్పకుండా చదువుపై ధ్యాస లేనట్లే, బుద్ధియోగము ఎటో భ్రమిస్తూ ఉన్నట్లే. ఇది యుద్ధ మైదానము కదా. ఇది సహజమైన విషయమని ఎవరూ భావించకండి. మనస్సులో తుఫానులు లేక వికల్పాలు అనేవి లెక్కలేనన్ని, వద్దనుకున్నా కానీ వస్తూంటాయి, ఇందులో తికమకపడకూడదు. యోగబలము ద్వారానే మాయ పారిపోతుంది, దీనికి ఎంతో పురుషార్థము చేయవలసి ఉంటుంది. వ్యాపార, వ్యవహారాలలో ఎంతగానో అలసిపోతారు ఎందుకంటే దేహాభిమానంలో ఉంటారు. దేహాభిమానం కారణముగా ఎంతగానో మాట్లాడవలసి ఉంటుంది. తండ్రి అంటారు - దేహీ-అభిమానులుగా అవ్వండి. దేహీ-అభిమానులుగా అవ్వడం ద్వారా బాబా ఏదైతే అర్థం చేయిస్తారో దానినే ఇతరులకు కూడా అర్థం చేయిస్తారు. స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. పిల్లలూ, బాహ్యముఖులుగా ఉండకూడదు, అంతర్ముఖులుగా ఉండాలి అని బాబాయే శిక్షణను ఇస్తారు. ఎక్కడైనా బాహ్యముఖిగా ఉండవలసి వచ్చినా కానీ, ఎంత ఖాళీ దొరికితే అంత ప్రయత్నించి అంతర్ముఖిగా ఉండాలి, అప్పుడే పాపాలు అంతమవుతాయి. లేకపోతే పాపాలు కూడా అంతమవ్వవు, అలాగే ఉన్నత పదవిని కూడా పొందరు. జన్మజన్మాంతరాల పాపాలు శిరస్సుపై ఉన్నాయి. అందరికన్నా ఎక్కువ పాపాలు బ్రాహ్మణులవే, వారిలో కూడా నంబరువారుగా ఉన్నారు. ఎవరైతే ఎంతో ఉన్నతముగా అవుతారో, వారే పూర్తిగా నీచులుగా కూడా అవుతారు. ఎవరైతే యువరాజుగా అవుతారో, వారే మళ్ళీ బికారిగా కూడా అవ్వవలసి ఉంటుంది. డ్రామాను బాగా అర్థం చేసుకోవాలి, ఎవరైతే మొదట వస్తారో వారు మళ్ళీ చివరిలో వస్తారు. ఎవరైతే మొదట పావనంగా అవుతారో, వారే మొదట పతితులుగా అవుతారు. తండ్రి అంటారు, నేను కూడా ఇతని అనేక జన్మల అంతిమంలో వస్తాను, అది కూడా ఎప్పుడైతే ఇతను వానప్రస్థావస్థలో ఉంటారో అప్పుడే వస్తాను. ఈ సమయములో చిన్నా, పెద్దా అందరిదీ వానప్రస్థావస్థ. సర్వుల సద్గతిని చేసేవారు అన్న గాయనము కూడా తండ్రికి ఉంది. అది పురుషోత్తమ సంగమయుగములోనే జరుగుతుంది. ఈ

పురుషోత్తమ సంగమయుగాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఏ విధంగా మనుష్యులకు కలియుగము గుర్తుందో, అలా సంగమయుగము కేవలం మీకు మాత్రమే గుర్తుంది. మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. చాలామందికైతే తమ వ్యాపార, వ్యవహారాలే గుర్తుంటాయి. బాహ్య విషయాల నుండి ముఖము తిప్పుకొని ఉన్నట్లయితే ధారణ కూడా జరుగుతుంది. అంత్యకాలములో ఎవరైతే స్త్రీని స్మరిస్తారో... అన్న ఒక నానుడి కూడా ఉంది. ఏ పాటలు లేక శ్లోకాలైతే చాలా బాగుంటాయో, వేటికైతే మన జ్ఞానంతో సంబంధం ఉంటుందో, వాటిని ఉంచుకోవాలి. ఉదాహరణకు - ఈ ఛీ ఛీ ప్రపంచం నుండి తప్పకుండా వెళ్ళవలసిందే... నయనహీనునికి దారిని చూపించు ప్రభూ... మొదలైన ఇటువంటి పాటలను మీ వద్ద ఉంచుకోవాలి. సంగమయుగము గురించి ఏమీ తెలియని మనుష్యులే వీటిని తయారుచేసారు. ఈ సమయంలో అందరూ జ్ఞానమనే నేత్రము లేని అంధులుగా ఉన్నారు. ఎప్పుడైతే పరమాత్మ వస్తారో, అప్పుడే వచ్చి దారిని చూపిస్తారు. ఒక్కరికి మాత్రమే చూపించరు కదా. ఇది వారి శివశక్తి సైన్యము. ఈ శక్తి సైన్యము ఏమి చేస్తుంది? శ్రీమతముపై కొత్త ప్రపంచ స్థాపనను చేస్తుంది. మీరు కూడా రాజయోగాన్ని నేర్చుకుంటారు, దీనిని భగవంతుడు తప్ప ఇంకెవ్వరూ నేర్పించలేరు. భగవంతుడు నిరాకారుడు, వారికి తమదంటూ శరీరము లేదు, మిగిలినవారు ఎవరైతే ఉన్నారో వారంతా శరీరధారులే. ఉన్నతోన్నతుడైతే ఒక్క తండ్రియే, వారు మిమ్మల్ని చదివిస్తారు. ఇది మీకే తెలుసు. మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. మీరు వార్నింగ్ ఇవ్వాలి, పెద్ద-పెద్ద వార్తాపత్రికలలో ఇది వేయాలి. మనుష్యులు ఏ యోగమునైతే నేర్పిస్తారో, అది హఠయోగము. రాజయోగాన్ని ఒక్క తండ్రియైన పరమపిత పరమాత్మయే నేర్పిస్తారు, దాని ద్వారా ముక్తి- జీవన్ముక్తి లభిస్తుంది. హఠయోగము ద్వారా ఆ రెండూ లభించవు. అది హఠయోగము, అది పరంపరగా నడుస్తూ వస్తుంది, అది పురాతనమైనది. ఈ రాజయోగాన్ని కేవలం సంగమయుగములో తండ్రే నేర్పిస్తారు.

భాషణ చేసేటప్పుడు టాపిక్ లను తయారుచేయాలి అని బాబా అర్థం చేయించారు, కానీ అలా చేయరు. శ్రీమతంపై నడిచేవారు చాలా కొద్దిమందే ఉన్నారు. మొదట భాషణను వ్రాయండి, ఆ తర్వాత పక్కా చేసుకోండి, అప్పుడు గుర్తుకువస్తుంది. మీరు డైరెక్టుగా నోటితో భాషణ చేయాలి, అంతేకానీ చదివి వినిపించకూడదు. ఎవరైతే స్వయాన్ని ఆత్మగా భావిస్తూ ఆ తర్వాత మాట్లాడుతారో, వారిలోనే విచార సాగర మంథనము చేసి భాషణ చేసే శక్తి ఉంటుంది. నేను నా సోదరులకు వినిపిస్తున్నాను, ఇలా భావించడం ద్వారా శక్తి ఉంటుంది. ఇది చాలా ఉన్నతమైన గమ్యము కదా. బాధ్యతను తీసుకోవడం అంత సులువైన విషయమేమీ కాదు. మీరు ఎంతగా శక్తివంతులుగా అవుతారో, అంతగా మాయ దాడి జరుగుతుంది. అంగదుడు మరియు మహావీరుడు కూడా శక్తివంతులే, కావుననే రావణుడిని కూడా మమ్మల్ని కదిలించి చూపించు అని అన్నారు. ఇవి స్థూలమైన విషయాలు కావు. శాస్త్రాలలో ఈ కల్పిత కథలు ఉన్నాయి. ఏ చెవులైతే పరమాత్మ అయిన తండ్రి యొక్క స్వర్ణిమ జ్ఞానాన్ని వినేవో, అవి కల్పిత కథలను వింటూ-వింటూ పూర్తిగా రాయిలా అయిపోయాయి. భక్తి మార్గములో నుదుటిని అరగ తీసుకున్నారు, అలాగే డబ్బును కూడా పోగొట్టుకున్నారు. మెట్లు కిందకు దిగుతూనే వచ్చారు. 84 జన్మల కథ కూడా ఉంది కదా. ఎవరెవరైతే భక్తి చేసారో, వారందరూ కిందకు దిగుతూనే వచ్చారు. ఇప్పుడు తండ్రి పైకి ఎక్కడం నేర్పిస్తారు. ఇప్పుడు ఇది మీ ఎక్కే కళ. ఒకవేళ బుద్ధియోగాన్ని బాబాతోపాటు జోడించి ఉంచకపోతే తప్పకుండా కిందకే పడిపోతారు. బాబాను స్మృతి చేసినట్లయితే పైకి ఎక్కుతారు. ఇందులో ఎంతో శ్రమ ఉంది, కానీ పిల్లలు నిర్లక్ష్యం చేస్తారు. వ్యాపారాలలో పడి బాబాను మరియు జ్ఞానాన్ని మర్చిపోతారు. ఫలానావారు ఇలా ఉన్నారు, ఇది చేస్తారు, ఈ బ్రాహ్మణి ఇలా ఉన్నారు, ఆమెలో ఈ అవగుణము ఉంది అంటూ మాయ తుఫానులలోకి తీసుకువస్తుంది. అరే, అందులో మీకు పోయేది ఏముంది! సర్వగుణ సంపన్నులుగానైతే ఎవరూ అవ్వలేదు. ఎవరి అవగుణాలనూ చూడకుండా గుణాలను గ్రహించాలి. అవగుణాలను చూసినట్లయితే ముఖము తిప్పేసుకోండి. మురళి అయితే లభిస్తుంది, అది వింటూ ధారణ చేస్తూ ఉండండి. బాబా చెప్పిన ఈ విషయం పూర్తిగా యథార్థమైనది అని బుద్ధి ద్వారా అర్థం చేసుకోవాలి. ఏ విషయమైతే సరిగ్గా అనిపించదో, దానిని వదిలేయాలి. చదువుపై ఎప్పుడూ అలగకూడదు. బ్రాహ్మణిపై లేక చదువుపై అలగడం అనగా బాబాపై అలగడం. ఇక అప్పుడు సెంటరుకు రాని పిల్లలు ఎంతోమంది ఉన్నారు. ఎవరు ఎలా ఉన్నా కానీ మీకు మురళితో పని ఉంది, మురళి ఏదైతే వినిపిస్తారో దానిలోని మంచి-మంచి పాయింట్లను ధారణ చేయాలి. ఎవరితోనైనా మాట్లాడటంలో అంత ఆనందం కలగకపోతే శాంతిగా మురళిని విని వెళ్ళిపోవాలి. అంతేకానీ, మేము ఇక్కడకు రాము అని అలగకూడదు. నంబరువారుగా అయితే ఉన్నారు. ఉదయమే లేచి మీరు స్మృతిలో కూర్చుంటారు, అది కూడా చాలా మంచిది. బాబా వచ్చి సెర్చ్ లైట్ ను ఇస్తారు. బాబా తమ అనుభవాన్ని వినిపిస్తారు - నేను ఎప్పుడైతే కూర్చుంటానో అప్పుడు అనన్యులైన పిల్లలు ఎవరైతే ఉన్నారో ముందు వారు గుర్తుకువస్తారు. వారు విదేశాలలో ఉన్నా, కలకత్తాలో ఉన్నా మొదట అనన్యులనే గుర్తుచేసుకుని సెర్చ్ లైట్ ను ఇస్తాను. పిల్లలు ఇక్కడ కూర్చొని ఉన్నా కానీ బాబా ఎవరైతే సేవ చేస్తారో వారిని స్మృతి చేస్తారు. మంచి పిల్లలు శరీరాన్ని వదిలి వెళ్తే వారి ఆత్మను కూడా

తలచుకుంటారు. ఎంతో సేవ చేసి వెళ్ళారు కావున తప్పకుండా ఇక్కడే సమీపంలో ఏదైనా ఇంట్లో ఉంటారు. వారిని కూడా బాబా తలచుకుని సెర్చ్ లైట్ ను ఇస్తారు. వాస్తవానికి అందరూ బాబా పిల్లలే, కానీ ఎవరెవరు మంచి సేవను చేస్తారు అనేది అందరికీ తెలుసు. బాబా - ఇక్కడ సెర్చ్ లైట్ ను ఇవ్వు అని అంటే, అప్పుడు ఇస్తారు. రెండు ఇంజన్లు ఉన్నాయి కదా. ఇతను కూడా ఎంతో ఉన్నత పదవిని పొందుతారు కావున తప్పకుండా శక్తి ఉంటుంది. ఎల్లప్పుడూ శివబాబాయే చదివిస్తున్నారని భావించండి అని బాబా అంటారు కావున వారి స్మృతే ఉండాలి. ఇకపోతే ఇక్కడ రెండు జ్యోతులు ఉన్నాయి అని అయితే మీరు అర్థం చేసుకున్నారు. ఇంకెవరిలోనూ ఇలా రెండు జ్యోతులు లేవు. కాబట్టి ఇక్కడ రెండు జ్యోతుల సమ్ముఖమునకు వస్తారు కావున బాగా రిఫ్రెష్ అవుతారు. ఉదయం సమయం చాలా మంచిది. స్నానం చేసి మేడ మీదకు ఏకాంతంలోకి వెళ్ళిపోవాలి. అందుకే బాబా పెద్ద-పెద్ద మేడలను నిర్మించారు. ఫాదర్లు కూడా పూర్తిగా సైలెన్స్ లోకి వెళ్తారు, తప్పకుండా వారు క్రైస్తునే స్మృతి చేస్తూ ఉండవచ్చు. వారికి గాడ్ గురించి తెలియదు. ఒకవేళ గాడ్ ను కనుక స్మృతి చేస్తూ ఉన్నట్లయితే తప్పకుండా శివలింగమే బుద్ధిలోకి వస్తూ ఉండవచ్చు. వారు తమ నషాలో వెళ్తూ ఉంటారు. వారి నుండి ఆ గుణాన్ని గ్రహించాలి. దత్తాత్రేయుడు కూడా అందరి నుండి గుణాలనే గ్రహించేవాడని అతని గురించి అంటూ ఉంటారు. పిల్లలైన మీరు కూడా నంబరువారు దత్తాత్రేయులు. ఇక్కడ ఏకాంతం చాలా బాగుంటుంది. ఎంత కావాలనుకుంటే అంత సంపాదన చేసుకోవచ్చు. బయటైతే వ్యాపార-వ్యవహారాలు గుర్తుకువస్తూ ఉంటాయి. నాలుగు గంటల సమయం కూడా చాలా మంచిది. బయటకు ఎక్కడకూ వెళ్ళవలసిన అవసరం లేదు. ఇంట్లో కూర్చొని ఉన్నారు, కాపలా కూడా ఉంది. యజ్ఞములో కాపలా కూడా ఉంచవలసి ఉంటుంది. యజ్ఞములోని ప్రతి వస్తువునూ సంభాళించవలసి ఉంటుంది ఎందుకంటే యజ్ఞములోని ఒక్కొక్క వస్తువు చాలా-చాలా విలువైనది, అందుకే సేఫ్టీ ఫస్ట్ (సురక్ష ఫస్ట్). ఇక్కడకు ఎవరూ రారు. ఇక్కడైతే నగలు మొదలైనవేవీ లేవు, ఇది మందిరం కూడా కాదు అని భావిస్తారు. ఈ రోజుల్లో దొంగతనాలు అన్ని చోట్లా జరుగుతూ ఉంటాయి. విదేశాలలో కూడా పాత వస్తువులను దొంగిలించి తీసుకువెళ్తారు. కాలం చాలా అశుద్ధంగా ఉంది. కామం మహాశత్రువు, అది అన్నింటినీ మరపింపజేస్తుంది.

మీకు ఉదయం ఒకటేమో సదా ఆరోగ్యవంతులుగా అయ్యే క్లాస్ జరుగుతుంది మరియు ఇదేమో సదా సుసంపన్నులుగా అయ్యే క్లాస్. తండ్రి స్మృతిని కూడా చేయాలి, అలాగే విచార సాగర మంథనము కూడా చేయాలి. తండ్రిని స్మృతి చేసినట్లయితే వారసత్వము కూడా గుర్తుకువస్తుంది. ఈ యుక్తి చాలా సహజమైనది. బాబా బీజరూపుడు. వారికి వృక్షము యొక్క ఆదిమధ్యాంతాల గురించి తెలుసు. మీ వ్యాపారము కూడా ఇదే. బీజాన్ని స్మృతి చేయడం ద్వారా పవిత్రముగా అవుతారు. చక్రాన్ని స్మృతి చేసినట్లయితే చక్రవర్తీ రాజులుగా అవుతారు అనగా ధనము లభిస్తుంది. రాజా విక్రముడు మరియు రాజా వికర్మాజీతుడు, వీరిరువురి కాలాలను కలిపేసారు. రావణుడు వచ్చినప్పుడు విక్రమ కాలము ప్రారంభమయ్యింది, తారీఖు మారింది. అది ఒకటి నుండి 2,500 సంవత్సరాల వరకు నడుస్తుంది, ఆ తరువాతది 2,500 సంవత్సరాల నుండి 5,000 సంవత్సరాల వరకూ కొనసాగుతుంది. హిందువులకైతే తమ ధర్మము గురించి తెలియదు. తమ అసలైన ధర్మాన్ని మరచి అధర్ములుగా అయిపోయింది ఈ ఒక్క ధర్మం వారే. ధర్మస్థాపకుడిని కూడా మర్చిపోయారు. ఆర్యసమాజం ఎప్పుడు ప్రారంభమయ్యింది అనేది మీరు అర్థం చేయించవచ్చు. ఆర్యులు (సభ్యత కలిగినవారు) సత్యయుగములో ఉండేవారు. అనార్యులు (సభ్యత లేనివారు) ఇప్పుడు ఉన్నారు. ఇప్పుడు బాబా వచ్చి మిమ్మల్ని తీర్చిదిద్దుతారు. మీ బుద్ధిలో మొత్తం చక్రమంతా ఉంది. మంచి పురుషార్థులెవరైతే ఉన్నారో వారికి స్వయమూ తెలుసు మరియు ఇతరుల చేత కూడా పురుషార్థము చేయిస్తారు. బాబా పేదల పాలిటి పెన్నిధి. పల్లెటూరి వారికి సందేశాన్ని ఇవ్వాలి. 6 చిత్రాలు చాలు. 84 జన్మల చక్రము యొక్క చిత్రము చాలా బాగుంది. దానిపై చాలా బాగా అర్థం చేయించండి. కానీ మాయ ఎంతటి ప్రబలమైనదంటే అది అన్నింటినీ మరిపింపజేస్తుంది. ఇక్కడైతే రెండు లైట్లూ కలిసి ఉన్నాయి. ఒకటేమో బాబాది మరియు ఇంకొకటి ఇతనిది - రెండూ చాలా శక్తివంతమైనవి, కానీ ఇతను అంటారు - మీరు ఆ ఒక్క శక్తివంతమైన లైటునే పట్టుకోండి. పిల్లలందరూ ఇక్కడకు పరిగెత్తుకుంటూ వస్తారు. ఇక్కడ డబల్ లైట్ ఉందని భావిస్తారు. బాబా సమ్ముఖముగా వినిపిస్తారు. నీ నుండే వినాలి, నీతోనే మాట్లాడాలి... అన్న గాయనము ఉంది. కానీ అలాగని ఇక్కడే కూర్చుండిపోవడం కాదు. 8 రోజులు చాలు. ఒకవేళ ఇక్కడే కూర్చొబెడితే లెక్కలేనంతమంది అయిపోతారు.

డ్రామానుసారంగా అంతా నడుస్తూ ఉంటుంది, కానీ మీకు ఆంతరిక సంతోషము ఎంతగానో ఉండాలి. ఎవరైతే తమ సమానముగా తయారుచేస్తారో, వారికే ఆ సంతోషము ఉంటుంది. ప్రజలను తయారుచేస్తేనే రాజులుగా అవుతారు. పాస్ పోర్ట్ కూడా కావాలి. బాబాను ఎవరైనా అడిగితే బాబా వెంటనే అంటారు - మిమ్మల్ని మీరు చూసుకోండి, నాలో ఏ

అవగుణాలు ఉన్నాయి? స్తుతి, నింద అన్నింటినీ సహించవలసి ఉంటుంది. యజ్ఞము నుండి ఏది లభిస్తే అందులో సంతోషంగా ఉండాలి. యజ్ఞము యొక్క భోజనముపై ఎంతో ప్రేమ ఉండాలి. సన్యాసులు కంచమును కడిగి తాగుతారు ఎందుకంటే వారు భోజనానికి అంతటి మహత్యమును ఇస్తారు. ఎటువంటి సమయం రాబోతుందంటే, ఇక ధాన్యం కూడా లభించదు. కావున అన్నింటినీ సహనం చేయవలసి ఉంటుంది, అప్పుడే పాస్ అవ్వగలుగుతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఎవరిలోనైనా ఏదైనా అవగుణము కనిపిస్తే మీ ముఖాన్ని తిప్పేసుకోవాలి. చదువుపై ఎప్పుడూ అలగకూడదు. దత్తాత్రేయుని వలె అందరి నుండి గుణాలను గ్రహించాలి.

2. బయటి నుండి బుద్ధిని తొలగించి అంతర్ముఖులుగా ఉండే అభ్యాసము చేయాలి. వ్యాపార, వ్యవహారాలలో ఉంటూ దేహీ-అభిమానులుగా ఉండాలి. ఎక్కువగా మాటలలోకి రాకూడదు.

వరదానము:- ఈశ్వరీయ సేవ యొక్క బంధనము ద్వారా సమీప సంబంధములోకి వచ్చే రాయల్ ఫ్యామిలీకి అధికారీ భవ

ఈశ్వరీయ సేవ యొక్క బంధనము సమీప సంబంధములోకి తీసుకువస్తుంది. ఎవరు ఎంత సేవ చేస్తారో, అంతగా ఆ సేవకు ఫలంగా సమీప సంబంధములోకి వస్తారు. ఇక్కడి సేవాధారులు అక్కడి రాయల్ ఫ్యామిలీకి అధికారులుగా అవుతారు. ఎంతగా ఇక్కడ కష్టమైన సేవను చేస్తారో, అంతగా అక్కడ హాయిగా సింహాసనముపై కూర్చుంటారు మరియు ఇక్కడ ఎవరైతే విశ్రాంతిని తీసుకుంటారో వారు అక్కడ అంతగా పని చేస్తారు. ఒక్కొక్క క్షణము, ఒక్కొక్క పని యొక్క లెక్కాపత్రము తండ్రి వద్ద ఉంది.

స్లోగన్:- స్వ పరివర్తన ద్వారా విశ్వ పరివర్తనా వైబ్రేషన్ ను తీవ్రగతితో వ్యాపింపజేయండి.